# మతిమరుపు దేవుడు

## ఎ. శ్యామలా రాణి

అగవిడుతున్న పూల గుబాళింపు, అలలు అలలుగా తేలి వచ్చే చిరుగాలి, సింధూరపు రాసులు నిండిన అందమైన ఆకాశం వింత సాయంకాలపుశోభ- ఒక్కర్తెనూ ఏంచేసుకోను?

ఇంటిపనులయ్యాయి. పని మనిషి వెళ్ళిపోయింది. తోటపనయింది. మాలీ వెళ్ళిపోయాడు. పింకీ ఆటకి వెళ్ళిపోయింది.

నేనెంత ఒంటరిదాన్ని!

ఐదు.... ఐదున్నర.... ఆరు!

ఊ హు....ఈ మనిషి జాడేలేదు.

మనిషేమిటి-తప్పు తప్పు....దేవుడు!

తన పెళ్ళిలో అంతా అలాగే కదా అన్నారు.

దేవుడు నిజంగా ఇలాగే వుంటే వాడికొకటికాదు కోటి దండాలు....దేవుడు!

మళ్ళీ మొదలై పోతుంది నా దినచర్య.

దూరం దూరంగా అక్కడక్కడా విసిరేసినట్టున్న బంగళాలు- దగ్గరలో మనిషి సంచారం లేదు. మనసు రంగం మీదికొస్తోంది పొందికగా....మడచి పెట్టిన పట్టు బట్టలా-

జోరు గాలులు రేగుతున్నాయి.

పట్టు బట్ట పొరలొక్కొక్కటే విడుతున్నాయి.

వాతావరణం గమ్మత్తుగా వుంది.

చలివేస్తున్నట్టుంది. కప్పుకుండే ఉన్ని బట్ట తీస్తే చలి-ఇది బయట వాతావరణం, దీనికి మార్పొస్తుంది. కాని లోపలి వాతావరణమో! ఎప్పుడూ ఇలాగే వుంటుంది

టార్చర్! నిజంగా ఎంత టార్చర్?

నేనే గయ్యాళిగా మారి మనసులోనిదంతా వెళ్ళగక్కేసినా బాగుండేది- లేదా ఇంత తింటూవుంటూ మనసుతో ప్రమేయం లేకుండా రఫ్‌గా బతికేసినా బాగుండేది. రెండూ కాలేక ఎందుకింత సెన్సిటివ్‌గా తయారయ్యాను?

పట్టుబట్ట పొరలెగురుతున్నాయి.

ఆ పొరలమధ్య ధూళి రేగి రేగి దుమారంగా మారుతుందేమోనని భయం.

మాగజైను అందుకున్నాను.

"సుఖ జీవనానికి చిట్కాలు!" నవ్వొచ్చింది చదివి. ఈ ఆర్టికల్ రాసిన శాస్త్రికి జాలిగా దొల్లిపోతున్నాయన్న మాట

రోజులు. అలాంటి వాళ్ళే ఇలా రాయగలరు.

ఏ చిట్కాలూ ఆ మనిషిమీద మాత్రం పనిచేయవు.

గ్రుఝింగా ఏం మనిషి!

ఎప్పుడూ ఆ బట్టలు నలిగినట్టే ఉంటాయి. జుట్టు రేగే వుంటుంది- గోళ్ళకు పాలిష్ అంటే ఏమిటో తెలియదు- కళ్ళద్దాల్లోంచి ఏదో వేదాంతిలా చూపులు - పుస్తకాలు తప్ప మరో ప్రపంచం తెలియని మనిషి- మళ్ళీ తప్పు—పతిదేవుడు!

ఆ రూపాన్ని కాసేపు మరచిపోవాలనుంది.

అబ్బ! ఎవరింట్లోంచో సంగీత సాధన- ఎంత కర్ణ కఠోరంగా ఉంది! శృతిలేని వీణనెలా మీటాలనిపిస్తుందో!..ఎలా గేమిటి? శృతిలేకుండా బ్రతుకులనే ఈడ్చేస్తున్న తనలాంటివాళ్ళుంటుంటే వీణకేం?

మనసు పొరలు రెప రెప లాడుతున్నాయి.

ఎగరనీ దుమారం రేగనీ!....కసిగావుంది.

అంతే! మొదలయింది.

"వసంతీ!"

దూరాన సన్నని పిలుపు. ఏనాటి పది హేనేళ్ళ క్రిందటి పిలుపో!

ఆ పిలుపు ఎటో లాక్కుపోయింది.

o o o

ఏవేళప్పుడు చూసినా మడత నలగని కొబ్బరికాయ ముక్కలాంటి బట్టల్లో అంతకన్నా చెక్కు చెదరని చిరునవ్వుతో పురంధర కృష్ణ! పేరులోనేకాదు ప్రత్యేకత- ఆ వ్యక్తే వేరు.

అతను నేను ఎమ్. ఏ. చదివిన రోజుల్లో కలిసిన వ్యక్తి, నా సహాధ్యాయని శ్యామల పెత్తండ్రి కొడుకు.

కాలేజి యానివర్సిరీకి నేను పాడేను. నా ఎదురుగా ముందువరసలో కూచున్నవాడు ప్రోగ్రాం అవుతూనే క్రొత్త బెరుకు లేకుండా వచ్చి అభినందించాడు. నేను అన్నిటికీ చాలా బిడియపడేదాన్ని మొగమాటంగానే థాంక్స్ చెప్పాను.

నేను పుట్టిపెరిగినది అటు పల్లె అనికాని ఇటు పట్నమనికాని చెప్పలేని ఊరు- ప్రయివేటుగా బి. ఏ చేశాను.

జ్యోతిషం వెర్రివున్న నాన్న ఆ రోజుల్లో పెళ్ళిచేస్తే మంచిది కాదంటే ఇంట్లో గోళ్ళు గిల్లుకుంటూ కూచోలేక చదువుతానన్నాను. విశాఖపట్నంలో ఉన్న



చిన్నత్త దగ్గరుంచుకుని చదివిస్తాను రమ్మంది. నాకూ కాలేజిలో చేరాలని ఉబలాటం. నాన్న నన్ను కాదన్నా చిన్న అత్తని కాదనలేక పంపారు ఆవిడకు పిల్లల్లేరు. నేనంటే ఆపేక్ష—నా చదువు మొదలయింది.

"అతనే మా కజిన్, నిన్ను చాలా లైక్ చేస్తాడు" అందోరోజు శ్యామల.

మా ఇంట్లో ఆడపిల్లలు అలా అబ్బాయిల గురించి స్వేచ్ఛగా ఆలోచించి అభిప్రాయాలు వెల్లడి చేసే అలవాటులేదు. అదో తప్పుగా భావించే ఫామిలీ మాది. అందుకే నేనేమీ అనలేదు. అట్టే ఆలోచించనూ లేదు.

నేనెక్కడికి వెళ్ళినా అతను కావాలనే ఎదురొచ్చేవాడు. హుషారుగా పలకరిస్తూ,

"హల్లో వసంతీ! బాగున్నారా?" అంటూ.

ఎవరు కనిపెడుతున్నారో, మర్యాదస్తుల కుటుంబంలోంచి వచ్చిన నేను ఎక్కడ అల్లరిపాలయి, పెద్ద పేరొచ్చేస్తుందేమోనని హడిలిపోయే దాన్ని. అతని నిర్భీతికి కొంచెం కోపం వచ్చేది. కాని, అతన్నింకే కారణంగానూ నేను అసహ్యించుకోలేక పోవడం చేత ముక్తసరిగా మాట్లాడి తప్పించుకునేదాన్ని.

పరీక్షలవుతున్నాయి.

"పురందర నిన్నడగమన్నాడు." శ్యామల నవ్వుతూ అందొకనాడు.

"ఏమిటి?" అన్నాన్నేను వెర్రి ముఖం వేసి.

"నువ్వు చాలా నచ్చేవట, నీలా అందంగా, సన్నగా, తెల్లగా అంతకంటే చల్లని కంఠంతో"... ఏమేమిటో చెప్పింది. నాకు ఒళ్ళు చెమటలు పట్టేసింది.

చిన్నత్తలో చెప్పే నామాట. తప్పు చేసినట్టు తలదించుకుని.

"మీనాన్న నిన్నూ నన్నూ కలిపి చంపిగల్డు!" అంటూ "నీ ఉద్దేశమేవిటి?" అంది.

"ఉద్దేశమేవిటి" కంటేముందు "చంపిగల్డు" అన్నామాటే నామీద పనిచేసింది.

"ఛీ! నాకలాంటి ఆలోచనేలే" దన్నాను నిశ్చితంగా మర్యాదయిన ఆడపిల్లలా.

"ఆముక్క చెప్పి అయితే" అంది చిన్నత్త.

శ్యామలతో చెప్పేసాను. శ్యామల నవ్వొక గర్విష్టిలా చూసింది.

తర్వాత రెండు మూడు సార్లు పురందర ఎదురొచ్చేడు. కాని మునుపటిలా హుషారుగా ధైర్యంగా పలకరించలేదు—కృత్రిమ పద్ధతిలో నన్ను నేనే మోసగించుకుంటూ తప్పు చేసానేమోనని లోలోపల అన్పించేది. బయటకు చెప్పలేక అంతర్యుద్ధంతో అలసి పోయేదాన్ని—అలా బాధ నణచుకున్నప్పుడు కడుపులోంచి గొంతులోంచి మంటగా అన్పించేది-యాసిడ్ పోసినట్టు.

తర్వాత కొంచెం రోజులకే పురందర స్టేట్స్ వెళ్ళిపోయాడని తెలిసింది.

మరో రెండేళ్ళకీ నా పెళ్ళయింది.

నాన్న దృష్టిలో ఈయన దేవుడు

దేవుళ్ళకి సరదా పాడు ఉండదుకాబోలు. తననొకరు గుర్తించలేదని ప్రశంసించలేదనీ బాధాలేదు, ఒకరిని గుర్తించి మెచ్చుకోవటమూ చేతకాదు.

ఉన్నతంగా దర్జాగా బతకాలన్న కోరికైనా లేదు.


ఏ ప్రపంచానికి చెందిన మనిషో! ఆబ్సెంట్ మైండెడ్ ప్రొఫెసర్!

నేనూ వింత మనిషినే ననిపిస్తుంది. నాలో చెలరేగే అసంతృప్తిని అణచకోనూ లేను, వెళ్ళగక్కనూలేను, నాలాంటి వాళ్ళకీ చిత్రహింస తప్పదుమరి,

గేటు చప్పుడైంది. ఎవరో జీపు దిగి వస్తున్నారు.

అంతవరకూ రంగులమీద దెలగాడుతున్నా మనసు చటుక్కున షెల్ లోకి దూరి పోయింది,

"నాపేరు ప్రకాశరావండీ. ఫ్రెండ్స్




క్లబ్ సెక్రెటరీని, మీరు మా క్లబ్ మెంబరే మధుగారు."

పరిచయాలు, నమస్కారం ప్రతి నమస్కారాలు అయ్యాయి.

"వారింకా రాలేదండీ." అన్నాను వినయంగా.

"ఇంకా రాలేదా? వస్తూంటారే లెండి. మీరు సిద్ధంగానే ఉన్నారు కదా?"

"ఎందుకు?"

"ఆ. ప్రోగ్రాం ఇంకా ఏడు గంటలకి లెండి మొదలు."

"ఏం ప్రోగ్రాం?"

"అరె! మీరు మర్చిపోయారా కొంప దీసి! ఈరోజే కదండీ క్లబ్ యానివర్సరీ"

ఏదో చాలా వ్యవహారమే ఉందన్నమాట. నాకేమీ తెలియదని వాళ్ళముందు ఒప్పేసుకుందికి చిన్నతనంగా ఉంది, ఆయన నాతో ఏదో చెప్పే ఉంటారు ముందుగానే. ఆయన ఏ విషయం నాతో వెంటనే చెప్పే అలవాటులేదు. తర్వాత మరిచి పోతారు అంతే....అలవాటు.

చిరాగ్గా ఉంది, గొంతులో ఏదో మంటగా ఉంది.

"ఆయన ఏడింటికి వస్తే తప్పక రావటానికి ప్రయత్నిస్తాం లెండి" గడుసుగానే ఏదో అన్నాననుకున్నాను,

వాళ్ళిద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకుని ఓ కాగితం తీసి నా చేతిలో పెట్టేరు. ప్రోగ్రాం కాగితం అది. నాగుండె జారిపోయిందొక్కసారి,

'ఏడు నుండి ఎనిమిది వరకు శ్రీమతి వసంతలక్ష్మి గానం'

"ఇదేమిటి?!" వెలవెలపోతూ అడిగేను,

నాకన్నా వెర్రి ముఖాలు పడ్డాయి వాళ్ళకి. అయినా వాళ్ళే ముందు తేరుకున్నారు.

వారంరోజులముందే ప్రోగ్రాం ప్రింటయిందట. నేను ఈరోజు పాడుతానని ఇరవై రోజుల ముందే ఆయన ఒప్పుకున్నా

రట, ఆయన చేతికి ఇన్విటేషన్ కూడా ఇచ్చేరట. నాకింతవరకు ఏమీ తెలియదు.

'ఛీ, ఎంతఅవమానం. ఎలా తలెత్తుకోవాలి? ఇంట్లో ఎలా ఏడ్చినా ఫరవాలేదు, కాని, బయట వాళ్ళముందు ఎంత న్యూనత! ఆయనమీద వాళ్ళకి చిన్నచూపు ఏర్పడుతుందేమో! అదీనాకే బాధ.

"ఈమధ్యంతా కాన్ఫరెన్స్ హడావిడిలో ఆయన సరిగా భోజనానికి ఇంటికే రావటంలేదు లెండి"—అదో అబద్ధం, (అడవాళ్ళని, అందున్నా నీలాంటి వాళ్ళని పాతెయ్యాలి అంటోంది మనసు) నిజానికా కాన్ఫరెన్స్ జరిగి నెలయింది.

నామాటలు వాళ్ళు వింటున్నట్టులేదు.

"మరి ప్రోగ్రాం ఎలాగండి. ఏదుకే గదా"

'నాసెత్తి కాయ ప్రోగ్రాం' అనాలనుంది.

"ఇంత హటాత్తుగా ఏం పాడతానండీ?" నాబుర్ర పనిచేయడం మానేస్తోంది. వాళ్ళకి ఒళ్ళు మండుతోందని తెలుసు నాకు.

"మీ పుణ్యముంటుంది, రసాభాసు కాకుండా ఏవో నాలుగు పాటలు పాడేద్దురూ" పాపం బ మాల్తున్నారు వాళ్ళు.

వీళ్ళకి సంగీతమంటే తెలిసినట్టులేదు. నాసంగీతం ఇంకెంత బూజుపట్టి పోయిందో అసలెరుగరు. వీళ్ళననుకుని ఏంలాభం?

అయినా నాకు సాధనలేదు. కనీసం నాలుగురోజుల ముందన్నా తెలిస్తే ఆయన మాట నిలబెట్టడానికైనా ఏదో ఆఘోరించే దాన్ని. ఇప్పుడు ఉన్నపాటున నేను స్టేజి ఎక్కి అభాసుపాలు కావాలా?

"సారీ-ఏనుమకోకండి!"

వాళ్ళేమనుకున్నారో కాని విసవిసా వెళ్ళిపోయారు-కనీసం నా పాట బదులు ఇంకేదో ఎరేంజి చేసుకునేడవాలిగా.

జీపు వెళ్ళిపోయింది.

నాకు కళ్ళ నీళ్ళొచ్చే పరిస్థితి.

ఆయనొచ్చేరు - అలసి సొలసిన కార్మికుడిలా.

ఫ్రెండ్సక్లబ్ ఇన్విటేషన్ చేతిలో పెట్టేను - ఏమిటనుకున్నారో ఏమో నవ్వుతూనే పుచ్చుకున్నారు. పేపరు విప్పి చదివేరు.

"అరే!" కాసేపు అంతరిక్షంలోకి చూస్తూ ఉండిపోయారు. నింగిని తాకే చెట్ల చివర్లని పిట్టల బారుల్ని చూస్తూ ఎదురుగా నే నున్నానని మరచి పోయారేమో!

నాకు ఒళ్ళు కుతకుత ఉడికి పోతోంది.

"ఏమిటో, నిజంగానే మరచిపోయాను సుమా-చాలా పొరపాటయింది." అంటూ జేబులోంచి అదే ఇన్విటేషన్ తీసి చూసుకుంటున్నారు,

ఎందుకది ఏడవను?

పావుగంటసేపు అలాగే నిలబడిపోయి, "పాపం ఏంఇబ్బంది పడుతున్నారోవాళ్ళు" ఇంకేదో గొణుగుతూ లోనికి నడిచారు.

అందులో నూరోవంతు సానుభూతి నామీదేడిస్తే ఎంత బాగుండును!

"వసంతలక్ష్మీ!"

రెండు నిముషాల్లో కేక, కాఫీ కోసం కాబోలు. అంతే ఆ అధ్యాయం ముగిసి పోయిందన్నమాట.

నాపేరు ఉట్టి వసంతలక్ష్మికాదు. వీర వెంకట సత్య వసంతలక్ష్మి. అలా పిలవండి. అనాలనుంది, ఆయనలా పిల్చినప్పుడల్లా అలా అనాలనే ఉంటుంది. కానీ అనలేను.

కాఫీ కలిపి ఇచ్చేను.

"ఈవాళ కాఫీ ఎందుకో చాలాబాగుంది సుమా!" ఆ మాత్రం మాట ఆయన నోట రావటం అరుదే. అందుకే అలాంటి మాట విన్ననాడు పండగంత వేడుకగానే ఉంటుంది-నాకు కాని, ఎందుకో ఇప్పుడది కూడా చికాగ్గానే ఉంది, మాట్లాడలేదు నేను.

"పోనీ, నువ్వు వెళ్ళవలసింది. ఏవో నాలుగు పాటలుపాడి వచ్చేస్తే సరిపోయేదిగా! పాపం వాళ్ళెంత ఇబ్బంది పడ్డారో," మళ్ళీ అదే గోల.

"నిజమేకాని నాకు బొత్తిగా సాధకం

లేదుకదండీ? ఏం పాడతాను?" నేనంత అణకువగా మాట్లాడితే నాకు ఒళ్ళు భగ భగ మండి పోతోందని ఆయన కెలా తెలుస్తుంది మరి; నా బలహీనతే అది,

"అవున్లే అదీ నిజమే. నా మరపు ననాలింతకీ!"

ఏం మనిషి! కసురుకోవాలో, జాలి పడాలో తెలియదు. మా ఇద్దరిమధ్య మరికాస్త సంభాషణ పెరిగితే నే నింకా కరిగిపోతానేమో!

పింకీ వచ్చింది ఆటనుంచి.

ఆయన పాఠాలు చెప్తున్నారు దానికి.

నేను యథాప్రకారం తోటలో వాలు కుర్చీలో.

పురందర! మళ్ళీ మనసు పొరల్లో.

నేను కాలేజిలో పాడటం—ఆరాధనగా అతని చూపు - ఎదుట పడినప్పుడల్లా చైతన్యం. మూర్తీభవించినట్లుగా 'వసంతీ' అంటూ.... నేనతన్ని అప్పట్లో నిజంగా ప్రేమించలేదు. ప్రేమించే ఉంటే సంప్రదాయాలూ చట్టు బండలూ కాదని అతన్నే పెళ్ళాడే దాన్నేమో!

కాని ఇప్పుడింతగా నేనతన్నే ఎందుకు గుర్తు చేసుకుంటాను? కాదు....కాదు.... అతను నాకు గుర్తొచ్చేలా చేస్తున్న దీ మనిషి. ఈయనున్నంచే మనసు తంపపుకోత.

"వసంతలక్ష్మి! వడ్డిస్తావా?"

యాంత్రికంగా వడ్డన. తిండి, రోజూ ఆయన వద్దన్నా మారు వెయ్యటం అలవాటు. కాని ఎందుకో స్పష్టంగా ఊరుకొన్నాను. జ్ఞాపకం లేక కాదు. ఆయన లాగే తినేసి నవ్వుకుంటూ లేచి చేయి కడిగేసుకున్నారు. నామనసు కలుక్కుమంది.

అలా నవ్వకపోతే నీకేమైంది? ఎందుకలా వున్నావు? అనకూడదూ? రోజూ మారు వేసే దాని వీ రోజు ఎందుకు వెయ్యలేదని కాస్త ఉక్రోషంగా ఓమాటైనా అనరాదూ? ఆ నవ్వేమిటి? అది నాపాలిటి వరమా? శాపమా?

నోటికి తిండి పోవడం లేదు.

రాత్రి పదయింది. అమావాస్య రోజులు. బయట చీకటి - నిశ్శబ్దం.

ఆయన పక్కమీద పడ్డదేపాటు, హాయిగా నిద్ర పోతున్నారు. అంత సులువుగా నిద్రెలా వస్తుందో?

'మైండ్ క్లియర్‌గా ఉంటే అలాగే వస్తుంది నిద్ర' అంటారాయన—ఉక్రోషం పట్టలేక ఎప్పుడైనా అడిగితే.

నిజమే-చీకూ చింత లేని జీవితం. నాకే ఈ గుంజాటమంతా. కళ్ళంట గిర్రున నీళ్ళు తిరిగాయి. పంతానికైనా ఆయన లాగ నిద్రపోవాలని ప్రయత్నం. నాకా భాగ్యం లేదు;

కాంపోజ్ వేసుకుని పడుకున్నాను.

"వసంతలక్ష్మి! వసంతలక్ష్మి?"

నిద్రలోంచి ఉలికి పడి లేచాను.

"కలవరిస్తున్నావు."

"ఏమని?!" మనసు పొరల్లోంచి ఏమి బయటకొచ్చాయో నని భయం, సన్నని వణుకు.

"నీకు సంగీతమంటే చాలా ఇష్టం. ఏమిటో నాకు సరిగమలైనా రావు. దేవుడు మనలాంటి జంటల్ని కావాలనే తయారు [illegible]లు;"

—— [illegible] ——

"[illegible]" నన్నాగా [illegible]

"[illegible]"

"అర్థరాత్రి ఇప్పుడేంపాట!" (ఆయన వన్నీ విచిత్రాలే) పడుకోబోయే ముందు వరకు ఆయనమీద కోపంగానే ఉంది కాని, ఇప్పుడెందుకో అన్నీ మరచి ఫక్కున నవ్వేను.

"పురందరదాసు కీర్తన- 'బారయ్యా వైకుంఠక్క' అని పాడుతుంటావు చూశావూ!"

పక్కలో పిడుగు పడితే ఇలాగే ఉంటుందా!!

పురందర గురించి ఈయనకు తెలుసా

కొంపతీసి! ఇంతకీ నేనేమని కలవరించేను. ఆ ప్రశ్న అడగలేను. ఏమని కలవరించేనో తెలుస్తూనే ఉందిగా.

"అన్నట్లు చెప్పడం మరచిపోయాను. ఆమధ్య జరిగిన కాన్ఫరెన్సుకి పురందర కృష్ణ అనే ఒకతను వచ్చారు. నిన్ను తెలుసునన్నాడు. నీపాటంటే, నువ్వంటే చాలా ఇష్టమన్నాడు. .. "

దేవుడా! ఏం ఘోరం జరగబోతోంది? నా చెవులు దిబ్బళ్ళేసుకు పోతున్నాయి. పురందర పెళ్ళి చేసుకున్నాడని, భార్యకూ తనకూ పడక విడాకులు పుచ్చుకున్నాడని తెలుసు. ఈయనకు నామీద ఏమైనా అనుమానం వస్తే? నా సంసారం ఏంకావాలి? దేవుడా! నన్ను క్షమించు. నేను నిజంగా పురందరని ప్రేమించలేదు. అతని జ్ఞాపకాలు పట్టి మనోవికారాలు మాత్రమే - నీకు తెలుసు.

"అతను భలే ఏక్టివ్‌గా ఉంటాడు. నీ గురించి ఎంత పొగిడాడో తెలుసా? నాకు చాలా గర్వమనిపించింది."

నేను మతి పోయినట్లు చూస్తూన్నాను. ఆకంఠంలో అసూయలేదు. అనుమానం లేదు. క్రోధంలేదు. వ్యంగ్యంలేదు. ఇదే పురందరలాంటి మగాడయితే? పాపం, విడాకులవరకు వచ్చిందట తన సంసారం అని జాలి పడేదాన్నిదివరకైతే. ఇప్పుడవన్నీ అసలు-తలవాలనిలేదు.

దేవుడా నువ్వెంత కరుణామయుడవి, నేను పాడుతున్నాను.

ఎంతో హాయిగా దూది పింజలా తేలికైన మనసుతో సంతోషంగా పాడుతున్నాను – ఆయన కోరిన పురందరదాసు కీర్తన.

పాడుతూ, పాడుతూ ఎందుకో ఆయన ముఖంలోకి చూసాను, గుడ్డి దీపం వెలుగులో స్పష్టంగా కనుపించటంలేదుకాని, సన్నగా గుర్రు వినిపిస్తుంది.

అంటే–చీకూ చింతా లేకుండా నిద్ర పోతున్నారన్నమాట. ఇదే మరొకప్పుడైతే పాడమని అడిగి పడుకున్నందుకు కోపం వచ్చేది.

ఛీఫ్ ! ఏం మనిషి !

తప్పు... తప్పు.... దేవుడు.

నిజంగా దేవుడు.

నా కళ్ళు చెమ్మగిల్లుతున్నాయి.

నా మనసులో పేరుకున్న దుమ్ము, ధూళి అంతా ప్రక్షాళితమై పోతోంది - ఆనంద ధారల్లో. ●


ప్రియమైన పాఠకులకు విలువైన ప్రచురణలు త్వరలో

గోపీచంద్ రచనలు
* పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా
* యమపాశం
* అసమర్థుని జీవయాత్ర

మల్లాది వెంకట కృష్ణమూర్తి రచనలు
* స్రవంతి
* చిలికోరిన వర్ణాలు
* బ్రతుకు భయం
* మిసెస్ పరాంకుశం

ఆర్ సంధ్యాదేవి రచనలు
* మువ్వల ముంగిళ్ళ
* హరిచందనం
* ప్రేమమకుటం

కావిలిపాటి విజయలక్ష్మి రచన
* రత్న పరాజయం

నలుగురు ప్రసిద్ధ రచయిత్రుల గొలుసు నవల
* అపరాజిత

డీలక్స్ పబ్లికేషన్స్
ఏలూరురోడ్ - విజయవాడ - 520 002